క్లుప్తంగా

నేడు దొంతమూరులో జగనన్న సురక్ష

రంగంపేట: మండలంలోని జి.దొంతమూరు గ్రామంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ బి.శ్రీరామరాజు తెలిపారు. కార్యక్రమంలో అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు.

'హలో బీసీ.. చలో ఢిల్లీ' పోస్టర్ ఆవిష్కరణ



'హలో బీసీ.. చలో ఢిల్లీ' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: మహిళలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు తదితర డిమాండ్లతో ఈ నెల 24న ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో బీసీ మహిళల ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాకు సంబంధించిన హలో బీసీ.. చలో ఢిల్లీ పోస్టర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధర్నా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి, బీసీ సంక్షేమ సంఘ జాతీయ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత, యువసేన స్టేట్ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు బూడిద శరత్‌కుమార్, మహిళా ఉపాధ్యక్షురాలు కొల్లేపల్లి సుభాషిణి, ప్రధాన కార్యదర్శి ఏలూరి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నోట్ పుస్తకాల అందజేత



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దాతలు

పెదపూడి: పెదపూడిలోని జూనియర్ మహిళా కళాశాల విద్యార్థినులకు మాజీ సర్పంచ్ మార్ని రుద్రఉమామహేశ్వరరావు, శ్రీసత్యసాయి సేవా సమితి కాకినాడ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులు సమకూర్చిన నోట్ పుస్తకాలు, స్టడీ మెటీరియల్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతలు అందించే సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల ఏర్పాటైన తొలి ఏడాదిలోనే ఉత్తమ ఫలితాలు సాధించిడానికి కృషి చేసిన ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ, అధ్యాపక బృందానికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ రైస్‌పై విద్యార్థులకు అవగాహన



బిక్కవోలు ఎఫ్‌సీఐ వద్ద విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌సీఐ మేనేజర్ సీహెచ్ శ్రీనివాస్

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు ఎఫ్‌సీఐ వద్ద బిక్కవోలు ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఫోర్టిఫైడ్ రైస్‌పై ఎఫ్‌సీఐ అధికారులు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఫ్‌సీఐ మేనేజర్ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ రక్తహీనత లోపం ఉన్నవారికి ఫోర్టిఫైడ్ రైస్ అందిస్తే కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ రైస్‌లో కేవలం 99 శాతం రైస్ ఉంటుందని, మిగిలిన శాతంలో ఐరన్, బి 12 విటమిన్‌లతో కూడిన పోషక పదార్థాలు ఉంటాయన్నారు. ఫోర్టిఫైడ్ రైస్ ఆరోగ్యానికి చాలా మంచిదని అందుకే అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు సైతం అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎఫ్‌సీఐ సిబ్బంది కె..శ్రీనివాసరావు, బి.గణపతి, ఉపాధ్యాయులు జంగా శ్రీనివాస్‌ప్రసాద్, కె.చంటిబాబు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



గోకవరం ఎల్‌ఐసీ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న సిబ్బంది

గోకవరం: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని గోకవరం ఎల్‌ఐసీ బ్రాంచి మేనేజర్ విద్యాసాగర్ అన్నారు. స్థానిక ఎల్‌ఐసీ బ్రాంచి కార్యాలయంలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచి మేనేజర్ విద్యాసాగర్ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో గోకవరం బ్రాంచి ద్వారా 6500 పాలసీలు సేకరించామని, ఒక్కో పాలసీకి ఒక్కో మొక్క చొప్పున నాటాలని సెంట్రల్ ఎల్‌ఐసీ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. ఈ మేరకు ఆగస్టు 31 వరకు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి 6500 మొక్కలు నాటుతామన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ ప్రసన్నకుమార్, సిబ్బంది ఎలిపే శ్రీనివాస్, స్వరాజ్యలక్ష్మి, వెంకట్రావు, విజయ్ కుమార్, లీలా కృష్ణ, ఏజెంట్స్ అసో సియేషన్ సెక్రటరీ ఎస్.నాగరాజు పాల్గొన్నారు.

కొండ గోదారితో ముంపు భయం



మిర్తిపాడు - బొబ్బిల్లంక మధ్యలో తొర్రిగడ్డ కాలువపై ఉన్న హైకల్వర్టు



హైకల్వర్టుకు ఏర్పాటు చేసిన చిన్న తూరలు

- టీడీపీ హయాంలో హైకల్వర్టు నిర్మాణం
- నీరు లాగక ముంపులో పొలాలు
- రైతులకు తప్పని అవస్థలు
- కల్వర్టును తొలగించాలని కలెక్టర్‌కు వినతి

సీతానగరం: మిర్తిపాడు - బొబ్బిల్లంక గ్రామాల మధ్యలో తొర్రిగడ్డ కాలువపై నెలకొల్పిన హైకల్వర్టుతో రైతులకు కొండగోదారి ముంపుభయం పట్టుకుంది. వర్షాకాలం నేపథ్యంలో ఏ సమయంలో కొండగోదారి పొంగుతుందో తెలియని పరిస్థితి. హైకల్వర్టుకు చిన్న తూరలు ఏర్పాటు చేయడంతో నీరు నిలిచిపోయి పొలాలు ముంపులోకి వెళ్లే అవకాశం ఉంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ కల్వర్టు కూలిపోవడంతో ఈ హైకల్వర్టు నెలకొల్పారు. దీనికింద రెండు వరసలుగా చిన్న సిమెంట్ తూరలు ఏర్పాటు చేశారు. దీనివల్ల కోరుకొండ, సీతానగరం మండలాల్లోని సుమారు 8,500 ఎకరాలకు ముంపు సమస్య పొంచిఉంది.

ముంపులో వేల ఎకరాలు

సీతానగరం, కోరుకొండ, గోకవరం మండలాల్లో కురిసిన వర్షంనీటితో పాటు సూరంపాలెం ప్రాజెక్టు నుంచి విడుదలయ్యే మిగులు జలాలు బురద కాలువ ద్వారా బొబ్బిల్లంక కాలువకు చేరుకుని గోదావరిలో కలుస్తాయి. అదే సమయంలో అఖండ గోదావరి వరద పోటెత్తి నీటిమట్టం పెరిగితే బొబ్బిల్లంకలోని స్లూయిస్ తలుపులు ఆటోమేటిక్‌గా మూసుకుపోతాయి. ఆ సమయంలో కొండగోదారి నీటిమట్టం, అఖండ గోదావరి నీటిమట్టానికి మించి ఉంటే స్లూయిజ్ తలుపులు తెరుచుకుని కొండ గోదారి నీరు అఖండ గోదావరిలో కలుస్తుంది. మిర్తిపాడు - బొబ్బిల్లంక హైకల్వర్టు తూరల నుంచి నీరు లాగకపోవడంతో నీరు ఎగపోటుతో వేల ఎకరాలు ముంపులో ఉంటాయి. దీని నుంచి బొబ్బిల్లంక స్లూయిజ్‌కు నీరు తక్కువగా వెళుతుంది. దీనితో ఖరీఫ్ సీజన్‌లో 8 వేల ఎకరాల్లో వరి పంటను రైతులు వేయలేకపోతున్నారు. పొలాల్లో నీరు డిసెంబర్ వరకు ఉండటంతో రబీలో సాగు చేస్తున్నారు.

అధికారుల పరిశీలన

మిర్తిపాడు - బొబ్బిల్లంక హైకల్వర్టును తక్షణమే తొలగించాలని కోరుతూ గత నెల 22న కోరుకొండ, సీతానగరం మండలాల రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై రాజమహేంద్రవరం ఆర్డీవో చైత్రవర్షిణి, జిల్లా వ్యవసాయశాఖాధికారి మాధవరావు, జలవనరులశాఖ అధికారులు కల్వర్టును పరిశీలించారు. రైతులతో మాట్లాడి, నష్టపోకుండా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. హైకల్వర్టు ఎగువ ఉన్న నీరు వచ్చే సమయంలో తుక్కు చిన్న తూరలకు అడ్డుపడి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటోంది. దీంతో నీరు ఎగపోటుగా పంటపొలాలను ముంచుతోంది. హైకల్వర్టును తొలగించి, చిన్న బ్రిడ్జిని ఏర్పాటు చేయడం ద్వారా ముంపు సమస్యను పరిష్కరించవచ్చని రైతులు అంటున్నారు.

రబీలో మాత్రమే సాగు



హైకల్వర్టు వల్ల డిసెంబర్ వరకూ పొలాల్లోని నీరు లాగడం లేదు. కోరుకొండ మండలం గుమ్ములూరు, బుచ్చింపేట, మునగాడ, కాపవరం, బూరుగుపూడి గ్రామాల్లోని మూడువేల ఎకరాలు ముంపులో ఉంటున్నాయి. దీంతో ఖరీఫ్‌లో పంటసాగుకు అవకాశం ఉండడం లేదు. రబీలో మాత్రమే సాగు చేస్తున్నాం. హైకల్వర్టును తొలగిస్తే మా సమస్య తీరుతుంది. రెండు పంటలు పండించుకునే అవకాశం ఉంటుంది.

– నక్కా రాంబాబు, రైతు, గుమ్ములూరు, కోరుకొండ మండలం

చిన్న బ్రిడ్జి నిర్మించాలి



కొండగోదారి ఎగపోటుతో చిన కొండేపూడి, రాపాక, కూనవరం, మిర్తిపాడు, ఉండేశ్వరపురం గ్రామాల పొలాలు ముంపులోకి వెళుతున్నాయి. మండలంలో సుమారు 5 వేల ఎకరాలు ముంపులో ఉంటోంది. అప్పటి టీడీపీ ప్రభుత్వ తప్పిదం వల్ల ఈ సమస్య ఏర్పడింది. తక్షణమే హైకల్వర్టును తొలగించి, చిన్న బ్రిడ్జిని ఏర్పాటు చేయాలి. దీనిపై కలెక్టర్‌కు విన్నవించాం. ఆర్డీవో, జిల్లా వ్యవసాయ శాఖాధికారి వచ్చి పరిశీలించారు. తక్షణమే హైకల్వర్టును తొలగించాలి.

– మాకాల ఈశ్వరరావు, రైతు, ఉండేశ్వరపురం

నవరత్నాలతో పేదల అభ్యున్నతి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఉత్సాహంగా గడప గడపకూ..

సీతానగరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు పేదల అభ్యున్నతికి దోహదపడుతున్నాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. చిన కొండేపూడిలో బుధవారం నాలుగోరోజు గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఆయన ఇంటింటికీ పర్యటించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో అందజేసిన సంక్షేమ పథకాల వివరాలు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం చినకొండేపూడికి రూ.1.67 కోట్లు కేటాయిస్తే, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో రూ.9.53 కోట్లు అభివృద్ధికి ఖర్చు చేసిందన్నారు. గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణం చేపట్టామని, వాటర్ ట్యాంక్, రోడ్లు, డ్రైనేజీల పనులు జరుగుతున్నాయన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజలు ఆత్మీయ స్వాగతం పలుకుతున్నారని, ముఖ్యమంత్రి జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలే దానికి కారణమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ -2 సత్యం మదన్‌బాబు, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, ఉప సర్పంచ్ సత్తిపండురాజు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ పోలినాటి రామచంద్రరావు, పార్టీ నాయకులు ముదునూరి రామకృష్ణంరాజు, మేడిశెట్టి చిన్నికృష్ణ, యర్రంశెట్టి బాబులు, ముదునూరి ప్రసాదరాజు, జంపన సూరిబాబు, కోసూరి నాగరాజు, కోనే శ్రీను (ఇంద్ర), వడ్లమూరి ప్రభాస్ రాజు, చిట్టియ్య, చిడిపి బంగారయ్య పాల్గొన్నారు.



చినకొండేపూడిలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాష్ట్ర ప్రజలకు వరం జగనన్న సురక్ష

పెదపూడి: జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఒక వరమని ఎంపీడీఓ పి.విజయభాస్కర్, తహసీల్దార్ టి.సుభాష్ అన్నారు. కైకవోలు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నూని పట్టాభిరామన్న చౌదరి, సర్పంచ్ వీరవెంకట సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు తిమ్మరాజు రాజుబాబు, ఉప సర్పంచ్ కొప్పి వీరశంకర్, దాట్ల సింహాద్రిరాజు, సచివాలయ కార్యదర్శి చిన్ని తదితరులు పాల్గొన్నారు.



కైకవోలులో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న నాయకులు, అధికారులు

కాపర్ వైరు చోరీ

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురంలో కాపర్ వైర్ చోరీపై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ పి.బుజ్జిబాబు బుధవారం తెలిపారు. ఎయిర్‌టెల్ సెల్‌టవర్‌కు సంబంధించిన 50 మీటర్ల కాపర్ కేబుల్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించి దొంగతనానికి పాల్పడ్డారన్నారు. దీని విలువ రూ.20 వేలు ఉంటుందన్నారు. సెక్యూరిటీ సూపర్‌వైజర్ కందికట్ల మణిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలిక అదృశ్యం

రంగంపేట: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ టి.రామకృష్ణ బుధవారం తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం కొత్త వీరంపాలెం గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలిక ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

డ్రైవర్ మృతికి సంతాపం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో రోజు వారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న కెల్లా శ్రీనివాసరావు హఠాన్మరణం ఆ కుటుంబానికి తీరనిలోటని వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. యూనివర్సిటీ సెమినార్ హాలులో బుధవారం సంతాప సభ నిర్వహించారు. శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సెంట్రల్ జైలు సందర్శన

కంబాలచెరువు: కేంద్ర కారాగారాన్ని డీఎల్ఎస్‌ఏ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి బుధవారం సందర్శించారు. అక్కడి ఆసుపత్రిలో సదుపాయాలను పరిశీలించి, ఖైదీలతో మాట్లాడారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నియమించిన పారాలీగల్ వలంటీర్లు అందుబాటులో ఉంటారని, ఏ విధమైన న్యాయ సలహాలు కావాలన్నా వారి ద్వారా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మాదక ద్రవ్యాల కేసుల్లో శిక్షలు తీవ్రంగా ఉంటాయని, వాటికి బెయిల్ లభించడం చాలా కష్టమన్నారు. ఖైదీలు పరివర్తన చెంది అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు.

బలభద్రపురంలో పశువైద్య శిబిరం



బలభద్రపురంలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలో బుధవారం ఏర్పాటుచేసిన పశువైద్య శిబిరాన్ని ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి ప్రారంభించారు. శిబిరంలో సుమారు 70 పశువులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పాడి రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండపేట పశుసంవర్ధక శాఖ జేడీ డి.చంద్రశేఖర్ గౌడ్, సర్పంచ్ బుంగా రామారావు, సొసైటీ అధ్యక్షుడు ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి, కొమరిపాలెం ఉపసర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

వర్జీనియా పొగాకు విక్రయాలకు రేపు ఆఖరి రోజు

సీతానగరం: మండలంలోని రఘుదేవపురం క్లస్టర్ గ్రామాలకు శుక్రవారంతో వర్జీనియా పొగాకు అమ్మకాలకు ఆఖరి రోజు అని దేవరపల్లి టుబాకో బోర్డు ఆక్షన్ సూపరింటెండెంట్ జీఎల్‌కే ప్రసాద్ బుధవారం ప్రకటనలో తెలిపారు. బ్లాక్ సోయల్ వర్జీనియా పొగాకు రైతులు తమ వద్ద ఉన్న టుబాకో బేళ్లను దేవరపల్లి టుబాకో బోర్డుకు తీసుకురావాలన్నారు. రఘుదేవపురం క్లస్టర్‌లో చినకొండేపూడి, కూనవరం, ముగ్గళ్ల, జాలిమూడి, మునికూడలి, రఘుదేవపురం, రాజంపేట, రాపాక, సీతానగరం, వెదుళ్లపల్లి గ్రామాలున్నాయన్నారు. దేవరపల్లి టుబాకో బోర్డు గోడౌన్‌లోని ఆర్‌ఆర్, ఎస్‌బీ బేళ్లను రైతులకు శుక్రవారం తెల్లవారుజామున 3.30 గంటలకు ఇవ్వడం జరుగుతుందన్నారు. కాటవరం క్లస్టర్ గ్రామాల్లోని రైతులకు శనివారం ఆఖరి రోజు అని తెలిపారు.

పలువురికి పరామర్శ

రాజానగరం: నియోజకవర్గంలో వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి బుధవారం పరామర్శించారు. స్వరూప్‌నగర్‌కు చెందిన సుంకర వెంకట సూర్యనారాయణ ఇంట జరిగిన పెద్దకర్మలో పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే తెలగంశెట్టి తులసీ రత్నం చిత్రపటానికి కూడా పూలమాల వేసి, నివాళులర్పించారు. దివాన్ చెరువుకు చెందిన ఎర్రంశెట్టి సోమరాజు, ఆచంట సత్యనారాయణ, బెజవాడ సత్యవతి, బొమ్మ చిన్ని కుటుంబ సభ్యులను, కోరుకొండ మండలం నిడిగట్లకు చెందిన బద్దిరెడ్డి ప్రభావతి కుటుంబ సభ్యులను విజయలక్ష్మి పరామర్శించారు.

వలంటీర్లకు వందనం

అన్ని విధాలా అండగా..

సీతానగరం: చినకొండేపూడికి చెందిన శ్రీరామకోలపల్లి భూలక్ష్మి దివ్యాంగురాలు. టైలరింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఇంటి నుంచి బయటకు రాలేని ఆమెకు ఆ ప్రాంత వలంటీర్ పురంశెట్టి శ్రీలక్ష్మి అన్నివిధాలా అండగా ఉంటోంది. కోవిడ్ సమయంలో మందులను అందజేసింది. అలాగే నిత్యావసరాలు, ఇతర వస్తువులను పంపిణీ చేసింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అవసరమైన పత్రాలను సిద్ధం చేసి, దరఖాస్తు చేయిస్తోంది. ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్‌ను అందజేస్తోంది.



భూలక్ష్మికి వర్తించే పథకాల కోసం వివరాలు సేకరిస్తున్న వలంటీర్ శ్రీలక్ష్మి

సేవలు అభినందనీయం



వలంటీర్ శ్రీలక్ష్మి నాకు అన్నివిధాలా భరోసా కల్పిస్తోంది. నా కుమార్తెకు సంబంధించి అమ్మఒడి పథకానికి కావాల్సిన పత్రాలు సిద్ధం చేసింది. ఆమె కృషితోనే నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేతుల మీదుగా ఇంటి స్థలం పట్టా అందుకున్నాను. అలాగే నాకు కాపునేస్తం వర్తిస్తుందని, దానికి కావాల్సిన పత్రాలు సిద్ధం చేస్తున్నానని చెప్పింది. వలంటీర్ శ్రీలక్ష్మి మా కుటుంబంలో సభ్యురాలిగా మారింది. ఆమె సేవలు అభినందనీయం.

– శ్రీరామకోలపల్లి భూలక్ష్మి, చినకొండేపూడి

ఆపత్కాలంలో అండగా వలంటీర్లు

పెదపూడి: 2020, 2021 సంవత్సరాల్లో కరోనా మహమ్మారి సృష్టించిన కల్లోలం అంతా ఇంతా కాదు. ఏ నిమిషం ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ గడిపిన కాలమది. వైరస్ ఎక్కడ సోకుతుందోనని ఏవైనా సరకులు తెచ్చుకోవడానికి కాలు అడుగు బయట పెట్టాలన్నా, పక్కింటి వాళ్లతో మాట్లాడాలన్నా భయపడిన రోజులవి.. ఆఖరికి అయినవాళ్లకి కరోనా సోకిందన్నా సరే ఆమడ దూరం పెట్టిన దుర్భర పరిస్థితులవి.. అలాంటి ఆపద సమయంలో వలంటీర్లు చేసిన సేవలు ఎవరూ మరిచిపోలేనివి. జి.మామిడాడ గ్రామంలోని బసివిరెడ్డి పేటలో వలంటీర్లు కె.రామ్‌చరణ్, ఎల్.రమేష్‌లు తమ ప్రాణాలను పణంగా పెట్టి ఇంటింటికీ అవసరమైన పాలు, పెరుగు, కూరగాయలు, బియ్యం తదితర నిత్యావసర సరకుల్ని ఎప్పటికప్పుడు అందజేశారు. ఎవరికి ఎలాంటి కష్టం వచ్చినా, ఎటువంటి అవసరమొచ్చినా అండగా నిలబడ్డారు. ఆఖరికి కరోనా రోగుల్ని ఆసుపత్రికి తీసుకెళ్లాలన్నా వెనకాడలేదు. అందుకే ఇప్పటికీ ఆ ప్రాంతవాసులందరికీ ఆయా వలంటీర్లంటే ఎంతో అభిమానం.



బసివిరెడ్డి పేటలో పాల ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వలంటీర్లు రామ్‌చరణ్, రమేష్

కష్టాలు గట్టెక్కాయి



నేను దివ్యాంగుడిని. గతంలో పింఛను సొమ్ము తీసుకోవాలంటే పంచాయతీ కార్యాలయానికి వెళ్లి తీసుకోవాల్సి వచ్చేది. నడవలేని స్థితిలో చాలా యాతనలు పడి పింఛను తీసుకునేవాడిని. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామ వలంటీర్ ప్రతి నెలా 1వ తేదీన తెల్లవారకముందే నేరుగా మా ఇంటికే వచ్చి పింఛను అందిస్తున్నారు. అంతేకాకుండా ఇంటికి వచ్చి మాకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి పథకాలు అందిస్తున్నారు. వలంటీర్లు లేకపోతే నేను చాలా అవస్థలు పడాల్సి వచ్చేది.

– మందపాటి వెంకటరత్నం, పింఛను లబ్ధిదారుడు, గోకవరం

వలంటీర్ల సేవలు వెలకట్టలేం



రెండేళ్ల క్రితం నాకు కాలు విరిగి ఆస్పత్రి పాలయ్యాను. రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీలో చికిత్స పొందాను. ఆ సమయంలో మా వలంటీర్ 30 కిలో మీటర్ల దూరంలో నేను చికిత్స పొందుతున్న ఆస్పత్రికి సొంత ఖర్చులతో వచ్చి నాకు పింఛను సొమ్ము అందజేసింది. వలంటీర్లు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివి.

– అరసాల చిట్టమ్మ, పింఛను లబ్ధిదారు, గోకవరం

21 నుంచి ఇంటింటా సర్వే నిర్వహించాలి

రాజానగరం: వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల నమోదు, సవరణపై అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా రాజమహేంద్రవరం ఆర్డీఓ చైత్రవర్షిణి స్థానిక జీఎస్ఎల్ ఆడిటోరియంలో వీఆర్వోలు, బీఎల్‌ఓలకు బీఎల్‌ఓ యాప్, స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకూ బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి జాబితాలో ఉన్న ఓటర్ల వివరాలపై సర్వే చేయాలన్నారు. జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ఓట్లు నమోదు చేయాలన్నారు. జాబితాలో డబుల్ ఎంట్రీ, నకిలీ ఓట్ల గుర్తింపు, చనిపోయిన వారి ఓట్ల తొలగింపు, డోర్ నంబరు లేకున్నా, ఒకే డోర్ నంబరులో ఎక్కువ సంఖ్యలో ఉన్నా క్షేత్ర స్థాయిలో నిశిత పరిశీలన చేయాలన్నారు. దీర్ఘకాలంగా దూర ప్రాంతాలకు వెళ్లి, అక్కడే నివాసం ఉంటున్న వారి ఓట్లను వారి అభీష్టం మేరకు ఎక్కడ ఉంచేదీ తెలుసుకోవాలన్నారు. కొత్తగా నివాస ప్రాంతాలు ఏర్పడి పోలింగ్ కేంద్రాలకు దూరంగా ఉంటే, ఆయా ప్రాంతాలలో కొత్తగా పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు సిఫారసు, ఓటర్ల జాబితా సవరణకు ఇది ఎంతో కీలకఘట్టమన్నారు. సమావేశంలో నియోజకవర్గంలోని సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో చైత్రవర్షిణి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

సీతానగరం: మండలంలోని చినకొండేపూడికి చెందిన మేడ వెంకటరావు కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే జక్కంపూడి రాజా బుధవారం అందజేశారు. గతంలో వెంకటరావు ముక్కుకు చికిత్స చేయించుకోవడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1.20 లక్షలు విడుదలయ్యాయి.

పోస్టర్ ఆవిష్కరణ

బీసీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఈ నెల 24, 25న న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహిస్తున్న హలో బీసీ, చలో ఢిల్లీ కార్యక్రమం పోస్టర్‌ను జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత ఆధ్వర్యంలో బుధవారం చినకొండేపూడిలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొల్లేపల్లి సుభాషిణి, రామేశ్వరపు భార్గవి, సలాది వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వెంకటరావు కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

ప్రకాశం నగర్: ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక, ప్రమాణ స్వీకారం బుధవారం స్థానిక శ్రీరస్తు ఫంక్షన్ హాల్లో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా రాజమహేంద్రవరం ఈస్ట్ డీఎస్పీ కిషోర్ కుమార్, వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్, గూడూరి రాధిక హాజరై, నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అసోసియేషన్ జిల్లా చైర్మన్‌గా అల్లు బాబీ, అధ్యక్షుడిగా మాద్దు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎ.ఫణికుమార్, కోశాధికారిగా కె.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఫొటో, వీడియో గ్రాఫర్ల సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఫ్రింటోనిక అధినేత సత్యవరపు గోకుల మురళి, గౌరవ అధ్యక్షులు మునిని బాబులు, డి.సత్యనారాయణ పాల్గొన్నారు.